PAK02A251

శీర్షము

సుమంగళి శతకము

యస్. వి. గోపాల్ & కో., మదరాసు 1.

i

C I

1 శ్రీరస్తు PAK0242S1

సుమతి శతకము

(పూర్వకవి ప్రణీతము)

ప్రకాశకులు :

వి.వి.గోవిందరాజ్

నెం.18, గోపాలపురం, 8-వ వీధి,

మదరాసు-600 086.

స్థాపితము: 1915 ☎ 479 345

(రిజిష్టర్డ్ కాపీరైట్)

సర్వ హక్కులు ప్రకాశకులవి]

[వెల : రూ. 5-00

శ్రీ సంపూర్ణ రామాయణము (వచన కావ్యము)

రామాయణమునందలి ముఖ్యాంశములను సంగ్రహ పరచి సర్వజనోపయుక్తమగు రీతిని వ్రాయబడిన వచనగ్రంథము. ఇందు దశరథుని రాజవైభవము, సంతానము కొరకు పుత్రకామేష్టి యాగము చేయుట, శ్రీరామలక్ష్మణ భరత శత్రుఘ్నుల జననము, విశ్వామిత్రుని యాగ సంరక్షణార్థము రామలక్ష్మణులు పోవుట, అహల్యా శాప విమోచనము, సీతా కళ్యాణము, శ్రీరాములవారి పట్టాభిషేక భంగము, సీతారామ లక్ష్మణు లరణ్యముల కేగుట, పాదుకా పట్టాభిషేకము, రావణుడు మాయలేడిని పంపి సీత నపహరించుకొని పోవుట, లంకా దహనము, రాముడు వానర సైన్యముతో సముద్రమునుదాటి రావణ, కుంభకర్ణాది రాక్షసులను చంపి సీతాదేవితో పుష్ప విమానారూఢుడై అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడగుట మున్నగు విషయములు సామాన్య చదువరులకు సైతము చక్కగా తెలియునట్లు ముద్దులొలుకు తేట తెలుగులో వ్రాయబడినది. స్త్రీ పురుషు లెల్లరును అవశ్యము చదువదగిన వచన గ్రంథము. అట్టబైండు వెల రూ. 30-00

శ్రీమద్భగవద్గీతా తాత్పర్య సంగ్రహము

అర్జునుని వ్యాజీకరించి శ్రీకృష్ణభగవానునిచే ఉపదేశింప బడినందున కృష్ణార్జున సంవాదమనియు, ప్రపంచ ప్రఖ్యాతి పొంది నట్టిదియు, భారతీయులకు మిక్కిలి పూజనీయమైనదియునగు యీ పవిత్ర గ్రంథము సామాన్యులు సైతము చదువుకొని చక్కగా అర్థము చేసికొనులాగున తాత్పర్యము వ్రాయబడినది. సామాన్య ప్రజలకు అందుబాటుగా వుండునట్లు ప్రచురించి యున్నాము.

450 పేజీలు బైండు గ్రంథము వెల రూ. 30-00

ఎన్. వి. గోపాల్ అండ్ కో., గోపాలపురం, మద్రాసు - 600 086.

శ్రీరస్తు

సుమతి శతకము

(పూర్వకవి ప్రణీతము)

క. శ్రీరామని దయచేతను
నారూఢిగ సకల జనులు ◆ నౌరా యనఁగా
ధారాళమైన నీతులు
నోరూరఁగ జవులు పుట్ట ◆ నుడివెద సుమతీ! 1

క. అక్కఱకు రాని చుట్టము;
ప్రొక్కిన వరమీని వేల్పు; ◆ మోహరము నఁ దా
నెక్కినఁ బాఱని గుఱ్ఱము
గ్రక్కున విడువంగవలయుఁ ◆ గదరా సుమతీ! 2

క. అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరను గొల్చి ◆ మిడుగుటకంటెన్
వడిగల యెద్దులఁ గట్టుక
మడి దున్నుక బ్రతుకవచ్చు ◆ మహిలో సుమతీ! 3

క. అడియాస కొలువుఁ గొలువకు
గుడిమణియము సేయఁబోకు; ◆ కుజనులతోడన్
విడువక కూరిమి సేయకు;
మడవినిఁ దోడరయ కొంటి ◆ నరుగకు సుమతీ! 4

క. అధరము గదలియుఁ గదలక
మధురములగు భాష లుడిగి ♦ మౌనవ్రతుఁడౌ
అధికార రోగపూరిత
బధిరాంధక శవముఁ జూడఁ ♦ బాపము సుమతీ! 5

క. అప్పుకొని సేయు విభవము;
ముప్పునఁ బ్రాయంపుటాలు; ♦ మూర్ఖుని తపము;
దప్పరయని నృపురాజ్యముఁ;
దెప్పరమై మీఁదఁగీడు ♦ దెచ్చుర సుమతీ! 6

క. అప్పిచ్చువాఁడు వైద్యుఁడు,
నెప్పుడు నెడతెగక పాఱు ♦ నేఱును ద్విజుఁడున్
జొప్పడిన యూర నుండుము;
చొప్పడకున్నట్టి యూరుఁ ♦ జొరకుము సుమతీ! 7

క. అల్లుని మంచితనంబును,
గొల్లని సాహిత్య విద్య ♦ కోమలి నిజమున్
బొల్లున దంచిన బియ్యముఁ
దెలలి కాకులను లేవు ♦ తెలియర సుమతీ! 8

క. ఆఁకొన్న కూడె యమృతము;
తాఁ కొందక నిచ్చువాఁడె ♦ ధాత; ధరిత్రిన్
సోఁ కోర్చువాఁడె మనుజుఁడు;
తేఁకువ గలవాఁడె వంశ ♦ తిలకుఁడు సుమతీ! 9

క. ఆఁకలి యుడుగని కడుపును
వేఁకటియగు లంజపడుపు ♦ విడువని బ్రతుకుఁ
బ్రాఁకొన్న నూతి యుదకము
మేఁకల పాడియును రోఁత ♦ మేదిని సుమతీ! 10

క. ఇచ్చునదె విద్య; రణమునఁ
జొచ్చునదే మగతనంబు; ♦ సుకవీశ్వరులఁ
మెచ్చునదె నేర్పు; వాదుకు
వచ్చునదే కీడుసుమ్ము; ♦ వసుధను సుమతీ! 11

క. ఇమ్ముగఁ జదువని నోరును,
అమ్మా! యని పిలిచి యన్న ♦ మడుగని నోరుఁ,
దమ్ములఁ బిలువని నోరును,
గుమ్మరి మను ద్రవ్వినట్టి ♦ గుంటర సుమతీ! 12

క. ఉడుముండదె నూఱేండ్లును;
బడియుండదె పేర్మిఁబాము ♦ పదినూఱేండ్లుఁ;
మడువునఁ గొక్కెర యుండదె;
కడునిలఁ బురుషార్థపరుఁడు ♦ కావలె సుమతీ! 13

క. ఉత్తమ గుణములు నీచున
కెత్తెఱఁగునఁ గలుగనేర్చు; ♦ నెయ్యెడలం దా
నెత్తిచ్చి కరఁగి పోసిన
నిత్తడి బంగార మగునె ♦ యిలలో సుమతీ! 14

క. ఉదకము ద్రావెడు హయమును,
మదమున నుప్పొంగుచుండు • మత్తేభంబుఁ,
మొదవుకడ నున్న వృషభముఁ
జదువని యా నీచుకడకుఁ • జనకుర సుమతీ! 15

క. ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ • వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయు వాఁడు • నేర్పరి సుమతీ! 16

క. ఉపమింప మొదలు తియ్యన
కపటం బెడనెడను జెఱుకు • కైవడినే పో,
నెపములు వెదకును గడపటఁ,
గపటపు దుర్జాతి పొందు • గదరా సుమతీ! 17

క. ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కామాటలాడి • యన్యుల మనముల్
నొప్పింపక తా నొవ్వక,
తప్పించుక తిరుగువాఁడు • ధన్యుఁడు సుమతీ! 18

క. ఎప్పుడుఁ దప్పులు వెదకెడు
నప్పురుషుని గొల్వఁగూడ • దది యెట్లన్నన్;
సర్పంబు పడగ నీడను
గప్ప వసించిన విధంబు • గదరా సుమతీ! 19

క. ఎప్పుడు సంపద గలిగిన
నప్పుడు బంధువులు వత్తు , రది యెట్లన్నఁ
దెప్పలుగఁ జెఱువు నిండినఁ
గప్పలు పదివేలు చేరుఁ , గదరా సుమతీ! 20

క. ఏఱకుమీ కసుగాయలు
దూఱకుమీ బంధుజనుల , దోషము సుమ్మీ!
పాఱకుమీ రణమందున;
మీఱకుమీ గురువులాజ్ఞ , మేదిని సుమతీ! 21

క. ఒక యూరికి నొక కరణము
నొక తీర్పరి యైనఁగాక , నొగిఁ దఱుచైనఁ
గకవికలుగాక యుండునె?
సకలంబును గొట్టుపడక , సహజము సుమతీ! 22

క. ఒల్లనిసతి నొల్లనిపతి,
నొల్లని చెలికాని విడువ , నొల్లనివాఁడే
గొల్లండు కాక, ధరతో
గొల్లండును గొల్లఁడౌనె , గుణమున సుమతీ! 23

క. ఓడల బండ్లును వచ్చును;
ఓడలు నాబండ్లమీఁద , నొప్పుగ వచ్చున్;
ఓడలు బండ్లును వలెనే,
వాడంబడుఁ గలిమి లేమి , వసుధను సుమతీ! 24

క. కడు బలవంతుండైనను
బుడమిని బ్రాయంపుటాలిఁ ♦ బుట్టిన యింటన్
దడవుండ నిచ్చెనేనియుఁ,
బడుపుగ నంగడికిఁ దానెఁ ♦ బంపుట సుమతీ! 25

క. కనకపు సింహాసనమున
ఘనకముఁ గూర్చుండఁబెట్టి ♦ శుభలగ్నమునం
దొనరఁగ బట్టముఁగట్టిన,
వెనుకటిగుణ మేలమానుఁ! ♦ వినురా సుమతీ! 26

క. కప్పకు నొరగాలైనను,
సప్పమునకు రోగమైన ♦ సతితులునైనన్,
ముప్పునఁ దరిద్రుఁడైనను
తప్పదు మఱి దుఃఖమగుట ♦ తథ్యము సుమతీ! 27

క. కమలములు నీటఁబాసినఁ
గమలాప్తుని రశ్మిసోఁకి ♦ కమలిన భంగిన్
దమతమ నెలవులు దప్పినఁ
దమమిత్రులు శత్రులౌట ♦ తథ్యము సుమతీ! 28

క. కరణముఁ గరణము నమ్మిన
మరణాంతక మౌనుగాని ♦ మనలేఁడు సుమీ
కరణము తన సరికరణము
మఱి నమ్మక మర్మమీక ♦ మనవలె సుమతీ! 29

క. కరణముల ననుసరింపక
విరసంబునఁ దిన్నతిండి ♦ వికటించుఁ జుమీ,
యిరుసునఁ గందెన బెట్టక
పరమేశ్వరు బండియైనఁ ♦ బాఁఅదు సుమతీ! 30

క. కరణము సాదై యున్నను,
గరి మద ముడిగినను; బాము కఱవక యున్నన్;
ధరఁదేలు మీట కున్నను,
గర మరుదుగ లెక్కఁగొనరు ♦ గదరా సుమతీ! 31

క. కసుగాయఁ గఱచి చూచిన
మసలక తిన వగరుగాక ♦ మధురంబగునా?
పస గలుగు యువతు లుండఁగఁ
బసిబాలలఁ బొందువాఁడు ♦ పశువుర సుమతీ! 32

క. కవి కాని వాని వ్రాఁతయు,
నవరస భావములు లేని ♦ నాతుల వలఁపున్
దవిలి చను పంది నేయని
వివిధాయుధ కౌశలంబు ♦ వృథరా సుమతీ! 33

క. కాదు సుమీ దుస్సంగతి;
పోదుసుమీ కీర్తికాంత ♦ పొందిన పిదపన్;
వాదుసుమీ యప్పిచ్చుట;
లేదుసుమీ సతుల వలఁపు ♦ లేశము సుమతీ! 34

క. కామకుఁడు తనిసి విడిచిన
కోమలిఁ బరవిటుఁడు కవయఁ ♦ గోరుట యెల్లన్
బ్రేమమునఁ జెఱకు పిప్పికిఁ
జీమలు వెస మూగినట్లు ♦ సిద్ధము సుమతీ! 35

క. కారణము లేని నగవును
బేరణమును లేని లేమ ♦ పృథివీస్థలిలోఁ
బూరణము లేని బూరెయు,
పీరణములు లేని పెండ్లి ♦ వృథరా సుమతీ! 36

క. కులకాంత తోడ నెప్పుడుఁ
గలహింపకు వట్టితప్పు ♦ ఘడియింపకుమీ;
కలకంఠి కంటఁ గన్నీ
రొలికిన సిరి యింట నుండ ♦ నొల్లదు సుమతీ! 37

క. కూరిమిగల దినములలో
నేరము లెన్నడును గలుగ ♦ నేరవు; మఱి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోఁచుచుండు ♦ నిక్కము సుమతీ! 38

క. కొంచెపు నరు సంగతిచే
నంచితముగఁ గీడువచ్చు ♦ నది యెట్లన్నన్
గించిత్తు నల్లికుట్టిన
మంచమునకుఁ బెట్టువచ్చు ♦ మహిలో సుమతీ! 39

క. కొక్కోక మెల్ల(జదివిన(
జక్కనివా(డైన రాజ ◆ చం(ద్రుండైనఁ
మిక్కిలి రొక్కము లియ్యక
చిక్కదురా వారకాంత; ◆ సిద్ధము సుమతీ! 40

క. కొఱగాని కొడుకు పుట్టిన(
గొఱగామియె కాదు; తం(డ్రి ◆ గుణముల(జెఱచుఁ;
జెఱకుతుద వెన్ను పుట్టిన(
జెఱకున(దీపెల్ల(జెఱచు; ◆ సిద్ధము సుమతీ! 41

క. కోమలి విశ్వాసంబును,
బాములతో(జెలిమి యన్య ◆ భామల వలపుఁ;
బేముల తియ్య(దనంబును,
భూమీశుల నమ్మికలును ◆ బొంకుర సుమతీ! 42

క. గడనగల మగని(జూచిన
నడుగులకును మడుగు లిడుదు ◆ రతివలు తమలో(
గడ నుడుగు మగని(జూచిన
'నడపీను(గు వచ్చె' ననుచు ◆ నగుదురు; సుమతీ! 43

క. చింతింపకు గడచిన పని
కింతులు వలతురని నమ్మ ◆ కెంతయు మదిలో,
నంతఃపుర కాంతలతో
మంతనములు మాను; మిదియె ◆ మతముర సుమతీ! 44

క. చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైనయట్లు ♦ పామరుఁడు తగఁ
హేమంబుఁగూడఁ బెట్టిన
భూమీశులపాలఁజేరు ♦ భువిలో సుమతీ! 45

క. చుట్టములు గానివారలు
'చుట్టములమునీ' కటంచు ♦ సొంపు దలిర్పఁ
నెట్టుకొని యాశ్రయింతురు;
గట్టిగ ద్రవ్యంబు గలుగఁ ♦ గదరా! సుమతీ! 46

క. చేతులకుఁ దొడవు దానము;
భూతల నాథులకుఁ దొడవు ♦ బొంకమి; ధరలో
నీతియ తొడ వెవ్వారికి;
నాతికి మానంబు తొడవు ♦ నయముగ; సుమతీ! 47

క. తడ వోర్వక, యొడ లోర్వక,
కడువేగం బడిచిపడినఁ ♦ గార్యం బగునే?
తడవోర్చిన, నొడ లోర్చినఁ,
జెడిపోయిన కార్యమెల్లఁ ♦ జేకుఱు! సుమతీ! 48

క. తన కోపమె తన శత్రువు,
తన శాంతమె తనకు రక్ష; ♦ దయ చుట్టంబౌ;
తన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమంద్రు ♦ తథ్యము; సుమతీ; 49

క. తనయూరి తపసితనమును,
దన పుత్రుని విద్య పెంపు • దన సతిరూపు,
దన పెరటిచెట్టు మందును,
మనసున వరింపరెటి • మనుజులు; సుమతీ! 50

క. తన కలిమి యింద్రభోగము;
తన లేమియె సర్వలోక • దారిద్ర్యంబు,
తన చావు జగత్ ప్రళయము;
తను వలచిన యదియె రంభ • తథ్యము సుమతీ! 51

క. తనవారు లేనిచోటను,
జనవించుక లేనిచోట • జగడము చోటు,
అనుమానమైన చోటను
మనుజునకును నిలువదగదు • మహిలో సుమతీ! 52

క. తములము సేయని నోరును;
రమణుల చనుమొనలమీద • రాయని మేనున్,
గమలములు లేని కొలకును;
హిమధాముడు లేనిరాత్రి • హీనము; సుమతీ! 53

క. తలనుండు విషము ఫణికిని
వెలయంగా దోకనుండు • వృశ్చికమునకున్,
దలతోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము • గదరా! సుమతీ! 54

క. తలపొడుగు ధనముఁ బోసిన
వెలయాలికి నిజములేదు ♦ వివరింపంగాఁ;
తలఁదడవి బాసఁజేసిన
వెలయాలిని నమ్మరాదు ♦ వినురా; సుమతీ! 55

క. తలమాసిన ఒలుమాసిన
వలువలు మాసినను బ్రాణ ♦ వల్లభునైనన్,
గులకాంతలైన రోతురు
తిలకింపఁగ భూమిలోనఁ ♦ దిరముగ; సుమతీ! 56

క. తాననుభవింప నర్థము
మానవపతిఁ జేరుఁ గొంత ♦ మఱి భూగతమౌఁ;
గానల నీఁగలు గూర్చిన
తేనియ యొరుఁ జేరునట్లు తిరముగ సుమతీ! 57

క. దగ్గఱి కొండెము చెప్పెడు
బ్రెగ్గడ పలుకులకు రాజు ♦ ప్రియుఁడై మఱి తా
నెగ్గు ప్రజ కాచరించుట,
బొగ్గులకై కల్పతరువుఁ ♦ బొడుచుట; సుమతీ! 58

క. ధనపతిసఖుఁడై యుండియు
నెనయంగా శివుఁడు భిక్ష ♦ మెత్తఁగవలసెన్;
దనవారి కెంత గలిగినఁ
దనభాగ్యమె తనకుఁగాక ♦ తథ్యము సుమతీ! 59

క. ధీరులకుఁ జేయు మేలది
సారంబగు నారికేళ ◆ సలిలము భంగిన్,
గారవము మీఱి మీఁదట
భూరిసుఖావహము నగును ◆ భువిలో సుమతీ! 60

క. నడువకుమీ తెరు వొక్కటఁ
గుడువకుమీ శత్రునింటఁ ◆ గూరిమితోడన్,
ముడువకుమీ పరధనముల;
నుడువకుమీ యొరుల మనసు ◆ నొవ్వఁగ సుమతీ! 61

క. నమ్మకు సుంకరి జూదరి,
నమ్మకు మగసాలివాని ◆ నటు వెలయాలిన్;
నమ్మకుమీ వామహస్తు ◆ నవనిని ◆ సుమతీ! 62

క. నయమునఁ బొలుచును ద్రావరు;
భయమునను విషమ్ము నైన ◆ భక్షింతురుగా;
నయ మెంత దోషకారియె?
భయమే చూపంగవలయు ◆ బొగుగ; సుమతీ! 63

క. నరపతులు మేరఁ దప్పిన,
దిరమెప్పఁగ విధవ యిటఁ ◆ దీర్ఘరియైనన్,
గరణము వైదికుఁ డైనను
మరణాంతక మౌనుగాని ◆ మానదు, సుమతీ! 64

క. నవరస భావాలంకృత
కవితాగోష్ఠియును మధుర ♦ గానంబును దా
నవివేకి కెంత, జెప్పినఁ
జెవిటికి సంకూదినట్లు ♦ సిద్ధము; సుమతీ! 65

క. నవ్వకుమీ సభలోపల,
నవ్వకుమీ తల్లిదండ్రి ♦ నాథులతోడన్,
నవ్వకుమీ పరసతితో;
నవ్వకుమీ విప్రవరుల ♦ నయమిది; సుమతీ! 66

క. నీరే ప్రాణాధారము
నోరే రసభరితమైన ♦ నుడువుల కెల్లన్;
నారియె నరులకు రత్నము;
చీరయె శృంగారమండ్రు ♦ స్త్రీలకు; సుమతీ! 67

క. పగవల దెవ్వరితోడను;
పగవంగా వలదు లేమి ♦ వచ్చిన పిదపన్;
దెగనాడ వలదు సభలను;
మగువకు మనసీయవలదు ♦ మహిలో సుమతీ! 68

క. పతికడకుఁ, దన్నుగూర్చిన
సతికడకును, వేల్పుకడకు ♦ సద్గురుకడకున్;
సుతకడకు, రిత్తచేతుల
మతిమంతులు చనరు ♦ నీతి మార్గము; సుమతీ! 69

క. పనిచేయు నెడల దాసియు,
ననుభవమున రంభ, మంత్రి ; యాలోచనలన్
దనభుక్తి యెడలఁ దల్లియు,
ననఁ దన కులకాంత యుండ ; నగురా; సుమతీ! 70

క. పరనారీ సోదరుఁడై
పరధనముల కాసపడక ; పరులకు హితుఁడై;
పరులు తనుఁ బొగడ నెగడక,
పరు లలిగిన నలుగ నతఁడు ; పరముఁడు; సుమతీ! 71

క. పరసతి కూటమిఁ గోరకు;
పరధనముల కాసపడకు ; పరునెంచకుమీ;
సరిగాని గోష్ఠి సేయకు;
సిరిచెడి చుట్టంబు కడకుఁ ; జేరకు; సుమతీ! 72

క. పరసతుల గోష్ఠి నుండిన
పురుషుఁడు గాంగేయుఁడైన ; భువి నిందపడున్,
గరిత సుశీలయ యైనను,
బరుసంగతి నున్న నింద ; పా లగు; సుమతీ! 73

క. పరునాత్మఁ దలఁచు సతి విడు;
మఱుమాటలు పలుకు సుతుల ; మన్నింపకుమీ;
వెఱ వెఱఁగని భటు నేలకు;
తఱచుగ సతిఁగవయఁబోకు ; తగదుర, సుమతీ! 74

క. పరుల కనిష్టము సెప్పకు;
పొరుగిండ్లకుఁ బనులులేక • పోపకు మెపుడున్
బరుఁ గడ్పిన సతిఁ గవయకు;
మెఱిఁగియు బిరుసైన హాయము • నెక్కకు; సుమతీ! 75

క. పర్వముల సతుల గవయకు;
నుర్వీశ్వరు కరుణ నమ్మి • యుబ్బకు; మదిలో
గర్వింప నాలిఁ బెంపకు;
నిర్వాహము లేనిచోట • నిలువకు సుమతీ! 76

క. పలుదోమి సేయు విడియము;
తలగడిగిన నాఁటినిద్ర • తరుణుల తోడన్
బొలయలుక నాఁటి కూటమి
వెలయింతని చెప్పరాదు • వినురా; సుమతీ! 77

క. పాఁపెఱుగని పతి కొలువును,
కూటంబున కెఱుకపడని • కోమలి రతియున్;
బేఁపెత్తఁజేయు చెలిమియు;
నేటికి నెదురీదినట్టు • లెన్నఁగ; సుమతీ! 78

క. పాలను గలసిన జలమును
బాలవిధంబుననె యుండుఁ • బరికింపంగాఁ,
బాలచవిఁ జెఱుచుఁ గావున
బాలసుఁడగు వానిపొందు • వలదుర; సుమతీ! 79

క. పాలసునకైన యాపదఁ
జాలింబడి తీర్పఁదగదు ♦ సర్వజ్ఞునకున్
దే లగ్నఁ బడఁగఁ బట్టిన
మే లెఱుఁగునె మీటుఁగాక ♦ మేదిని సుమతీ; 80

క. పిలువని పనులకుఁ బోవుట,
కలియని సతి రతియు. రాజు ♦ గానని కొలువున్,
బిలువని పేరంటంబును,
వలవని చెలిమియును జేయ ♦ వలదుర సుమతీ! 81

క. పురికినిఁ బ్రాణము కోమటి;
వరికినిఁ బ్రాణంబు నీరు; ♦ వసుమతి లోనన్
గరికినిఁ బ్రాణము తొండము;
సిరికినిఁ బ్రాణంబు మగువ ♦ సిద్ధము సుమతీ! 82

క. పులి పాలు దెచ్చి యిచ్చిన,
నలవడఁగా గుండెగోసి ♦ యఱచే నిడినన్,
దలపొడుగు ధనముఁ బోసిన;
వెలయాలికిఁ గూర్మిలేదు ♦ వినురా సుమతీ! 83

క. పుత్రోత్సాహము తండ్రికిఁ
బుత్రుఁడు జన్మించి నపుడె ♦ పుట్టదు జనులా,
పుత్రునిఁ గనుగొని పొగడఁగఁ
బుత్రోత్సాహంబు నాఁడు ♦ పొందుర సుమతీ! 84

క. పెట్టిన దినముల లోపల
నట్టడవుల కైనవచ్చు ; నానార్థములున్;
బెట్టని దినములఁ గనకపు
గట్టెక్కిన నేమిలేదు ; గదరా సుమతీ! 85

క. పొరుగునఁ బగవాఁ డుండిన
నిరవొందక వ్రాఁతకాఁడె ; యేలికయైనన్;
ధరఁ గాపు కొండెమాడినఁ
గరణాలకు బ్రతుక లేదు ; గదరా సుమతీ! 86

క. బంగారు కుదువఁ బెట్టకు
సంగరమునఁ బాఱిపోకు; ; సరసుఁడవైనన్
అంగడి వెచ్చము లాడకు;
వెంగలితోఁ జెలిమి వలదు ; వినురా సుమతీ! 87

క. బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి ; పలుకుట మేలా;
బలవంతమైన సర్పము
చలిచీమలచేతఁ జిక్కి ; చావదె సుమతీ! 88

క. మండలపతి సముఖంబున
మెండైన ప్రధానిలేక ; మెలఁగుట యెల్లన్,
గొండంత మదపు టేనుఁగు
తొండము లేకుండునట్లు ; తోచుర సుమతీ! 89

క. మంత్రి గలవాని రాజ్యము
తంత్రము చెడకుండ నిలుచుఁ ♦ దఱుచుగ ధరలో
మంత్రి విహీనుని రాజ్యము
జంత్రము కీలూడినట్లు ♦ జరుగదు సుమతీ! 90

క. మదినొకనిఁ వలఁచి యుండఁగ;
మదిచెడి యొక క్రూరవిటుఁడు ♦ మానక తిరుగున్;
అది చిలుక పిల్లి పట్టినఁ
జదువునె యా పంజరమున? ♦ జగతిని సుమతీ! 91

క. మాటకుఁ బ్రాణము సత్యము;
కోటకుఁ బ్రాణంబు సుభట ♦ కోటి ధరిత్రిన్
బోటికిఁ బ్రాణము మానము,
చీటికిఁ బ్రాణంబు వ్రాలు ♦ సిద్ధము సుమతీ; 92

క. మానఘనుఁ డాత్మ ధృతిచెడి
హీనుండగు వాని నాశ్ర ♦ యించుట యెల్లన్
మానెఁడు జలముల లోపల
నేనుఁగు మెయి దాచినట్టు ♦ లెఱుగుము సుమతీ! 93

క. మేలెంచని మాలిన్యుని,
మాలను, నగసాలవాని ♦ మంగలి హితుగా
నేలిన నరపతి రాజ్యము
నేలఁ గలసిపోవుఁ గాని ♦ నెగడదు సుమతీ! 94

క. 'రా, పొమ్మ'ని పిలువనియా
భూపాలునిఁ గొల్వ భుక్తి ♦ ముక్తులు గలవే?
దీపంబు లేని యింటను
జేపుణి కీళ్లాడినట్లు ♦ సిద్ధము సుమతీ! 95

క. రూపించి పలికి బొంకకు;
ప్రాపగు చుట్టంబు నెగ్గు ♦ పలుకకు; మదిలోఁ
గోపుంచు రాజుఁ గొల్వకు,
పాపపు దేశంబు సొరకు ♦ పదిలము సుమతీ! 96

క. లావుగల వాని కంటెను
భావింపఁగ నీతిపరుఁడు ♦ బలవంతుండౌ;
గ్రావం బంత గజంబును
మావటివాఁ డెక్కినట్లు ♦ మహిలో సుమతీ! 97

క. వరదైన చేను దున్నకు;
కఱవైనను బంధుజనుల ♦ కడకేఁగకుమీ
పరులకు మర్మము సెప్పకు;
పిరికికి దళవాయితనముఁ ♦ బెట్టకు సుమతీ; 98

క. వరిపంట లేని యూరును,
దొరయుండని యూరు, తోడు ♦ దొరకని తెరువున్,
ధరను బతిలేని గృహమును
నరయంగా రుద్రభూమి ♦ యనఁదగు సుమతీ! 99

క. వినఁదగు నెవ్వరు చెప్పిన;
వినినంతనె వేగపడగ , వివరింపఁ దగున్,
గని కల్లనిజముఁ దెలిసిన
మనుజుఁడెపో నీతిపరుఁడు , మహిలో సుమతీ! 100

క. వీడెము సేయని నోరును;
జేడెల యధలమృతంబుఁ , జెందని నోరుఁ,
బాడంగ రాని నోరును;
బూడిద కిరవైన పాడు , బొందర సుమతీ! 101

క. వెలయాలివలనఁ గూరిమి
కలుగదు, మటిఁ గలిగెనేని , కడతేఱుగా;
పలువురు నడిచెడు తెరువునఁ
బులు మొలవదు, మొలచెనేని , పొదలదు సుమతీ! 102

క. వెలయాలు సేయు బాసలు;
వెలయఁగ నగసాలిపొందు , వెలమల చెలిమిఁ,
గలలోనఁ గన్న కలిమియు,
విలసితముగ నమ్మరాదు , వినురా సుమతీ! 103

క. వేసరపు జాతికానీ,
వీసముఁ దాఁ జేయునట్టి , వెంగలి గానీ,
దాసి కొడుకైనఁ గానీ,
కాసులు గలవాఁడె రాజు , గదరా సుమతీ! 104

క. శుభముల నొందని చదువును;
నభినయమును రాగంసము , నందలి పాటల్,
అభిలాష లేని కూటమి,
సభమెచ్చని మాటలెల్ల , జప్పన సుమతీ! 105

క. సరసము విరసము కొరకే,
పరిపూర్ణ సుఖంబు లధిక , బాధల కొరకే,
పెరుగుట విఱుగుట కొరకే;
ధర తగ్గుట హెచ్చుకొరకే , తథ్యము సుమతీ! 106

క. సిరి తా వచ్చిన వచ్చును
సరళమ్ముగ నారికేళ , సలిలము భంగిన్,
సిరి దా బోయిన బోవును,
కరి మ్రింగిన వెలగపండు , కరణిని సుమతీ! 107

క. స్త్రీలయెడ వాదులాడకు;
బాలురతో జెలిమిజేసి , భాషింపకుమీ;
మేలైన గుణము విడువకు;
మేలినపతి నిందసేయ , కెన్నడు సుమతీ! 108

సుమతి శతకము

సంపూర్ణము.

ఆనందభారతి పవర్ ప్రెస్, గోపాలపురం, మద్రాసు - 600 086.

Check List

Book Number	PAK02A251	Date	26/5/22
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	GI 125		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Swathi	Pages	29